క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన సీఐ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ స్వామి

రెబ్బెన: నూతన సీఐగా బుద్దె స్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం సీసీఆర్‌బీలో విధులు నిర్వర్తించిన ఆయన రెబ్బెనకు బదిలీ అయ్యారు. ఇక్కడ సీఐగా పని చేసిన చిట్టిబాబు మల్టీజోన్‌–1 ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీఐని కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాఫర్

కెరమెరి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి శేక్ జాఫర్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఐదు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న 6 వేల కోట్లు తక్షణమే విడుదల చేయాలన్నారు. స్కాలర్‌షిప్‌తో సంబంధం లేకుండా ఆయా కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు అందించాలన్నారు. నాయకులు భీంరావు, కిరణ్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ పంపిణీ



కుట్టుమిషన్ అందజేస్తున్న వలంటరీలు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన కొడప శిరీషకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిషా జోహ్రీ, జగేంద్ర కుమార్ జోహ్రీ మెమోరియల్ ట్రస్టు వలంటరీ గడ్డ మహేశ్‌కుమార్ శుక్రవారం ఉచితంగా కుట్టుమిషన్ అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దుర్గం రాజన్న, భుజంగరావు, వలంటరీలు రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాయిసెంటర్ జిల్లా సార్ మెడిగా ఎన్నికైన మడావి శ్రీనివాస్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాదేవేణి మల్లేష్ శాలువాతో సన్మానించారు. జిల్లాలోని ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ రమేష్, శ్యాంరావ్, నాయకులు వైరాగడే ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థిక సాయం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

బెజ్జూర్: రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద గిరిజన కుటుంబానికి మహిళా సంఘాల సభ్యులు అండగా నిలిచారు. శుక్రవారం మండలంలోని అందుగులగూడ గ్రామానికి చెందిన ఆత్రం రజినీకాంత్‌కు తీవ్ర జ్వరం ఉండడంతో కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను కోమాలోకి వెళ్లినట్లు వైద్యులు తెలిపారు. స్పందించిన ఐకేపీ సీసీ పోర్తేటి పద్మ, అందుగులగూడ వీవో అధ్యక్షురాలు మాధవి, జయసుధ, సీఏ పార్వతి, మహిళా సంఘం సభ్యురాలు ముందుకొచ్చి కుటుంబసభ్యులకు రూ.16,250 ఆర్థికసాయం అందజేశారు.

- బెజ్జూర్ మండలంలోని సోమిని గ్రామానికి చెందిన జంగం శంకర్ – తారాబాయికు మారుడు జంగం జీవన్‌దాస్ పాము కాటు కు గురై మృతి చెందాడు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

సమాచారమంతా ఒకేచోట

- ఒకే క్లిక్‌తో పాఠశాలల సమాచారం
- యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు
- జిల్లాలో 1265 బడుల్లో 10739 మంది విద్యార్థులు



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: విద్యా వ్యవస్థ సమగ్ర సమాచారాన్ని ఒకే చోట నిక్షిప్తం చేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. అందుకోసం యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో విద్యాశాఖకు సంబంధించిన పూర్తి వివరాలు ఒక్కక్లిక్‌తో ప్రత్యక్షం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు ఏ పాఠశాలలో ఉన్నాయి. ఎంత మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారో అనే విషయాలను స్పష్టంగా తెలుసుకోవచ్చు. యూడైస్ ప్లస్ గతంలో సంవత్సరం ఒక్కసారి సమాచారం అప్‌డేట్ చేసేవారు. కానీ ప్రస్తుతం ఆధునీకరించారు. ఇక నుంచి మూడు గంటలకోసారి సాంకేతికత ఆధారంగా సమాచారాన్ని అప్‌డేట్ చేసే అవకాశం ఉంది. మూడు విభాగాలుగా విభజించి సమాచారం నిక్షిప్తం చేయనున్నారు. పాఠశాల మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాడ్యుల్స్ అంశాల వారీగా వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు.

ఒక్కో విద్యార్థికి ఒక నెంబర్..

యూడైస్ ప్లస్ పోర్టల్ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తుంది. ప్రతీ ఏడాది అన్ని పాఠశాలల్లో సమగ్ర వివరాలను ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో నమోదు చేసిన విద్యార్థికి ఒక పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పీఈఎస్) కేటాయిస్తారు. దీని ద్వారా ఆ విద్యార్థి దేశ వ్యాప్తంగా ఏఏ పాఠశాలల్లో ఏఏ తరగతులు చదివాడు అనేది తెలుస్తుంది. పదో తరగతి విద్యార్థి బోర్డు పరీక్షలు రాయాలంటే ఇందులో నమోదై ఉండాలి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1265 పాఠశాలాలున్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 732, ప్రైవేట్ 107తో పాటు ఆశ్రమ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కేజీబీవీలు, మోడల్ స్కూల్‌లల్లో కలిపి మొత్తం 10739 మంది విద్యార్థులు ఈవిద్యా సంవత్సరంలో విద్యనభ్యసిస్తున్నారు.

సమగ్ర సమాచారం..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వపరంగా అందుతున్న వసతుల కల్పనకు యూడైస్ ప్లస్‌లోని వివరాలు కీలకం కానున్నాయి. కేజీ నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్న ప్రతీ విద్యార్థి వివరాలు వెబ్‌సైట్ పొందుపరుస్తున్నారు. వెబ్‌సైట్‌లో నమోదైన విద్యార్థులకే ఇకపై యూనిఫాం, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు అందించనున్నారు. పాఠశాలల సమగ్ర వివరాలు అందుబాటులో ఉండడంతో పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వపరంగా నిధులు మంజూరు కానున్నాయి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



సమావేశమైన అధికారులు

పెంచికల్‌పేట్: మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగు సంచారం నేపథ్యంలో మండలంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని పెంచికల్‌పేట్ తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, అటవీశాఖ, మండల అభివృద్ధి, పోలీస్‌శాఖల అధికారులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. గతంలో ఏనుగు దాడి నేపథ్యంలో మండలంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. సమావేశంలో ఎంపీడీవో అల్బర్ట్, ఎఫ్‌ఆర్‌వో అనిల్‌కుమార్, ఎస్సై కొమురయ్య, ఆర్‌ఐ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన

పెంచికల్‌పేట్: మహారాష్ట్ర సరిహద్దుల్లో ఏనుగు సంచరిస్తున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా పెంచికల్‌పేట్ అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కొండపల్లి గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏనుగు సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళలో ఒంటరిగా వెళ్లవద్దని సూచించారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం

దహెగాం: బీమా పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డీడీఎం వీరభద్రుడు అన్నారు. జన సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో ఏడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, జన్‌ధన్ అకౌంట్ గురించి వివరించారు. అదే విధంగా ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎల్‌సీ అంజన్న, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ ఋషి దేవ్, సీఈవో బక్కయ్య, సిబ్బంది ప్రదీప్, రాజబాబు, శేఖర్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న ఎక్సైజ్‌శాఖ సీఐ రవి

కౌటాల: వైన్స్ షాపు నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి హెచ్చరించారు. శుక్రవారం కౌటాలలోని బాలాజీ వైన్స్, వైష్ణవి వైన్స్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం స్టాక్ వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. పర్మిట్ రూంల్లో సిట్టింగ్ ఏర్పాటు చేయవద్దని, షాపుల ఎదుట వాహనాల రద్దీ లేకుండా చూడాలని సూచించారు. లూజ్ మద్యం విక్రయించొద్దని, షాపులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మద్యం కల్తీకి పాల్పడితే షాపులను సీజ్ చేస్తామన్నారు. మద్యం అమ్మకాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట అబ్కారీశాఖ పోలీసులున్నారు.

బుద్ధుడి బోధనలు ప్రపంచానికి ఆదర్శం



బుద్ధ వందనం చేస్తున్న భక్తులు

వాంకిడి: బుద్ధుడి బోధనలు ప్రపంచానికి ఆదర్శమని బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్ అన్నారు. మండల కేంద్రంలోని జైదవాన్ బుద్ధవిహార్లో నిర్వహించిన వర్షవాస్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబేద్కర్ గౌతమ బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా గౌతమి బుద్ధుడి జీవిత చరిత్రపై గ్రంథ పఠన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే సంఘం శరణం గఛ్ఛామి అనే నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జైరాం, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, నాయకులు ప్రశాంత్, సందీప్, విలాస్, రాజేంద్రప్రసాద్, రమాబాయి పాల్గొన్నారు.

'నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి'



స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: రైల్వేలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను మళ్లీ కాంట్రాక్టు పద్ధతిలో నియామకం చేపట్టేందుకు రైల్వేబోర్డు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు గెడం టికనంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్డు రైల్వేస్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం, చాపిడి శ్రావణి, సహాయ కార్యదర్శి ఆత్మకూరి సతీష్, కమిటీ సభ్యులు శివ, తదితరులు పాల్గొన్నారు.

'రైతు సంక్షేమంపై మాట్లాడే హక్కులేదు'

రెబ్బెన: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రైతు సంక్షేమం గురించి మాట్లాడే నైతిక హక్కులేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, నాయకులు మురళీ, చిరంజీవిగౌడ్, సోమశేఖర్, గంటుమేర, కార్తీక్, ప్రేందాస్, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో సృజనాత్మకత



మాట్లాడుతున్న ఉదయ్‌బాబు

వాంకిడి(ఆసిఫాబాద్): పుస్తక పఠనంతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని జిల్లా పరీక్షల విభాగం సహాయ అధికారి ఉదయ్‌బాబు అన్నారు. రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాంకిడి మండలంలోని ఖిరిడి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని శుక్రవారం ప్రారంభించా రు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వా రా పిల్లల్లో ఆలోచన, ఊహా శక్తి, కొత్త పదాల పై అవగాహన పెరుగుతుందన్నారు. లైబ్రరీ లో ఇంగ్లిష్, తెలుగు భాషల్లో సుమారు 700 పుస్తకాలు, రీడింగ్ టేబుల్స్, బీరువా, చిత్రాలు వేసేందుకు ప్రత్యేక సామగ్రి సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆరినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, ఎంఈవో శివచరణ్, హెచ్‌ఎం శోభ, రూమ్ టు రీడ్ జిల్లా ఇన్‌చార్జి జెన్నిఫర్, కోఆర్డినేటర్ రాజు, సీఆర్పీలు విజయ్‌బాబు, సునీల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ పసికందు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం పసికందు మృతి చెందారు. చింతగూడ గ్రామానికి చెందిన రాజు తన 45 రోజుల కుమారుడిని మూడురోజుల క్రితం ఆస్పత్రిలో చేర్పించాడు. అయితే బాలుడి పరిస్థితి మెరుగుపడినట్లు రిపోర్టులు వచ్చాయని, శుక్రవారం ఉదయం కుమారుడికి తల్లి పాలివ్వగా, ఊపిరితిత్తుల్లోకి పాలు పోయి మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్యంతో కారోబార్ మృతి

దహెగాం: మండలంలోని ఐనం గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కారోబార్ జాడి మల్లయ్య(35) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. మల్లయ్య గత పది సంవత్సరాలుగా ఐనం పంచాయతీలో కారోబార్‌గా పని చేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ.. మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ నుంచి రూ. 10 వేల నగదును ఆర్థిక సాయం అందించామని పంచాయతీ కార్యదర్శి రాజేశ్ తెలిపారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

బెజ్జూర్: అధిక వర్షాల కారణంగా ప్రాణహిత ఉప్పొంగి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించా లని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని వ్యవసాయ శాఖ కమిషనర్ బి.గోపిను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సోమిని, తలాయి, తిక్కపల్లి, ఇప్పలగూడా, మొగవెల్లి, పాత సోమిని, పాపన్నపేట, భీమారం గ్రామాలకు చెందిన రైతుల పత్తి పంటలు నష్టపోవడం జరిగిందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సర్వే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వందల మంది రైతులకు పరిహారం అందకుండా పోయిందన్నారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాణ స్వీకారానికి హాజరైన ఎమ్మెల్సీ



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

బెజ్జూర్: నిర్మల్ జిల్లా నూతన గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్మల్‌లో నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన చైర్మన్‌గా అర్జుమంద్ అలీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. జిల్లాలోని గ్రంథాలయాలు మరింత అభివృద్ధి చెంది నిరుద్యోగ యువతకు చేయూత ఇవ్వాలన్నారు. కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పల గణేష్, అర్షద్ హుస్సేన్, అలీ పాల్గొన్నారు.

చదవడం, రాయడం రావాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

కెరమెరి: విద్యార్థులకు చదవడం, రాయడం రావాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఇందాపూర్, ప్రాథమిక పాఠశాల ఆగుర్‌వాడ, సాంగ్విలను సందర్శించారు. వచ్చే నెలలో నాస్ పరీక్షలు నిర్వహించనున్న దృష్ట్యా అందరు చక్కగా పరీక్షలు రాసేలా పిల్లలను సన్నద్ధం చేయాలన్నారు. తప్పనిసరిగా మెనూ పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

'ఆదివాసీ సంస్కృతి గొప్పది'



నివాళులర్పిస్తున్న పోలీసులు, నాయకులు

జైనూర్(ఆసిఫాబాద్): ఆదివాసీ సంస్కృతి ఎంతో గొప్పదని గోండి ధర్మ రాష్ట్ర కోయ పుణ్యం కార్యదర్శి ఆత్రం ఆనంద్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కుమురంభీం, కాశీపటేల్ విగ్రహాలకు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేసి దసరా పండుగ, భీం వర్ధంతి నిర్వహించారు. ప్రత్యేక నృత్యాలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, సీఐ రమేశ్, ఎస్సైలు సాగర్, రామారావు, భీం మనుమడు సోనేరావు, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్ రూరల్: ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బురుదగూడ, అందవెల్లి గ్రామాల్లో ఈజీఎస్ గ్రామసభలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వచ్చే ఏడాదిలో చేపట్టే ఉపాధి హామీ పనులను ఎంపిక చేశామన్నారు. ఉపాధిహామీ కూలీలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో బుచ్చన్న, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ వెంకటేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాదులో నిలదీసినందుకు కాంగ్రెస్ నాయకులు కేటీఆర్‌ను విమర్శించడం సరికాదన్నారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు చేయలేదు. బీఆర్‌ఎస్ నాయకులు పిడుగు అభిరామ్ రెడ్డి, కిరణ్ కుమార్, మగ్గిడి ప్రకాష్, తోట శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: కేటీఆర్ దిష్టిబొమ్మ దహనానికి నిరసనగా బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆదిలాబాద్ సభలో కేటీఆర్ వాస్తవాలు మాట్లాడితే కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడలేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

లారీ యజమానుల రాస్తారోకో

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో లారీల యజమానులు, డ్రైవర్లు, క్లీనర్ల ఆందోళనలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పెట్రోల్‌పంపు ఏరియా (లారీ అసోసియేషన్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు) బంద్ చేపట్టారు. ఉదయం స్థానిక ఎన్టీఆర్ చౌక్‌లో రాస్తారోకో చేపట్టారు. జేకే పేపర్‌మిల్లు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. డీఎస్పీ రామానుజం, పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సైలు, స్పెషల్ పార్టీ పోలీసులు రాస్తారోకో చేస్తున్న లారీ డ్రైవర్లు, యజమానులు, క్లీనర్లను బలవంతంగా అక్కడి నుంచి పంపించారు. అక్కడి నుంచి అసోసియేషన్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. లారీ యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌బాబు మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం అందించారు. డిమాండ్లు నెరవేర్చేవరకు ఆందోళనలు ఆపేదిలేదని స్పష్టం చేశారు.

అంకితభావంతో పని చేయాలి



నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులు

రెబ్బెన: సంస్థలో నూతనంగా అడుగుపెడుతున్న ఉద్యోగులు అంకిత భావంతో పని చేసి ఉత్తమ ఉద్యోగులుగా గుర్తింపు పొందాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. గోలేటిలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాల్లో భాగంగా ఉద్యోగ నియామక పత్రాలను శుక్రవారం అందచేశారు. అలాగే తొమ్మిది మంది బదిలీ వర్కర్లకు సర్వేస్ మజ్దూర్ పదోన్నతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో అనతి కాలంలోనే ఉన్నతస్థాయికి చేరుకునేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఉద్యోగులు ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న యువత నిబద్ధతతో పని చేయాలన్నారు. సింగరేణి గనుల్లో బొగ్గు నిల్వలకు కొదువ లేదని సంస్థకు మంచి భవిష్యత్ ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు మొగిళి, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహారా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిగ్రీ తర్వాత వివిధ ఉద్యోగ అవకాశాల గురించి జిల్లా ఉపాధి కల్పనాధికారి సతీశ్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వివిధ దినపత్రికలు చదవడంతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలను అధ్యయనం చేయాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు విభిన్న కేరీర్ అవకాశాల గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్‌చార్జి లక్ష్మినరసింహం, అధ్యాపకులు పాల్గొన్నారు.